నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మణికొండ: గండిపేట మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల 14 నుంచి నవంబర్ 14వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ మునీరుద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాల్లో వట్టినాగులపల్లి, 17న ఖానాపూర్, 18,19 న మంచిరేవుల గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు కార్యక్రమం ఉంటుందని, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన



బీటీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ శరత్‌చంద్ర

శంషాబాద్: రాళ్లగూడ నుంచి ఓఆర్ఆర్ సర్వీసు రహదారి వరకు 800 మీటర్ల బీటీ రోడ్డు పనులను శంషాబాద్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శరత్‌చంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 49 లక్షల నిధులతో పనులు చేపట్టామని నాణ్యమైన పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ సాజిద్, ఏఈ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చింతల్‌లో 'పోషణ మాసం'



శంషాబాద్ రూరల్: ముచ్చింతల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తాజా కూరగాయలు, పండ్లతో పోషకాలు అందుతాయని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు. అలాగే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పాదయాత్రగా శబరిమలకు



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లికి చెందిన సాయిరాం, బుడాల శ్రీకాంత్, రాకేశ్, కమలాకర్, వినయ్, ఆర్య మంగళవారం ఉదయం గ్రామం నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఇరుముడులు కట్టుకుని గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారికి మాజీ ఎంపీటీసీ నగేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం



శ్రీనివాసరావు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు యరగొర్లకు రెండు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో అరుదైన అవకాశం కలిగింది. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఎఫ్ఆర్ఎస్‌సీ), తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(ఎఫ్‌టీఏఎస్)లలో ఫెలోగా ఎన్నికయ్యారు. డాక్టర్ శ్రీనివాసరావు సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, టీటీ-యాక్టివేటెడ్ ఆల్కహాల్‌ను ఉపయోగించి కొత్త ప్రతి చర్యలను అభివృద్ధి చేయడం, మల్టీకంపోనెంట్ రియాక్షన్లు, సీ-హెచ్ ఫంక్షనలైజేషన్, మెకనోకెమిస్ట్రీ వంటి అంశాల్లో నిష్ణాతుడు. హెచ్‌సీయూలో ఫ్యాకల్టీగా చేరే ముందు ఆయన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్‌లో 5 ఏళ్లు పనిచేశారు. డాక్టర్ శ్రీనివాసరావు 2022లో చాన్స్‌లర్ అవార్డును అందుకున్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు 2019లో అసోసియేట్ ఫెలోగా ఎన్నికయ్యారు. డీఎస్‌టీ నుంచి ఫాస్ట్ ట్రాక్ యంగ్ సైంటిస్ట్ గ్రాంట్‌ను కూడా పొందారు.

వాలీబాల్ మ్యాచ్‌ను తిలకించిన విద్యార్థులు

గచ్చిబౌలి: జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయ వాలీబాల్ పోటీలను రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఫ్యాకల్టీ, విద్యార్థులు మంగళవారం తిలకించారు. ఈ సందర్భంగా స్టేడియంలో అధికారిక ఈవెంట్ టీషర్టులను ఎఫ్‌డీడీఐ-హెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళికి మీరాలంమండి ఆలయం ముస్తాబు

- ఈ నెల 18న ధన్‌తేరస్‌తో వేడుకలు ప్రారంభం
- 20న అమ్మవారి ఖజానా పంపిణీ
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



అమ్మవారు



మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నిజాం కాలంలో నగర ప్రజలకు కూరగాయలు, ఆకు కూరలు అందించే ప్రధాన కూరగాయల మార్కెట్‌గా కొనసాగిన మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో ఏడాది పొడవునా అమ్మవారికి నిత్యం పూజలు జరుగుతాయి. ఇక ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు, దసరా శరన్నవరాత్రి వేడుకలతో పాటు దీపావళి వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఇక్కడి భక్తులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఇక్కడ దీపావళి వేడుకలు జరుగనున్నాయి.

ధన్‌తేరస్‌తో వేడుకలు షురూ..

18న ధన్‌తేరస్‌ను పురస్కరించుకొని తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, ఆంజనేయస్వామికి అభిషేకం, మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. 19న నరక చతుర్దశిని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి మహాభిషేకం, అలంకారం, ఆంజనేయ స్వామికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు 108 అష్టోత్తర దిపోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. అలాగే ఈ నెల 20న దీపావళిని పురస్కరించుకొని రాత్రి 12:05 గంటలకు పంచహారతి, సామూహిక హారతి ఉంటుంది. అనంతరం అమ్మవారి ఖజానా పంపిణీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఖజానా పంపిణీ చేస్తాం..



శతాబ్దాలుగా మీరాలంమండిలో అమ్మవారికి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మహిళా భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భక్తులకు దీపావళి పర్వదినం సందర్భంగా అమ్మవారి ఖజానా పంపిణీ చేయనున్నాం. ఇందుకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశాం.

– గాజుల అంజయ్య, ఆలయ చైర్మన్

ఇంటర్నెట్‌తో క్షణాల్లో సమాచారం



మాట్లాడుతున్న సయ్యద్ అబ్దుల్ సయీద్

మణికొండ: ఇంటర్నెట్ వచ్చాక విద్యా వ్యవస్థ పూర్తిగా మారిపోయిందని విద్యార్థులకు తక్షణమే సమాచారం అందుతుందని భారత తత్వవేత్త, ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సయ్యద్ అబ్దుల్ సయీద్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఇంగ్లీష్ టీచర్స్ ఫోరం-భారత్, చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ-హైదరాబాద్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ఆంగ్లభాష బోధన, శిక్షణ, అభ్యాసం కోసం మీడియా మీద జరిగిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధ్యాయులు జ్ఞానం అందించే వారిగా మాత్రమే కాకుండా విద్యా ప్రజాస్వామ్యానికి ప్రతినిధులుగా మారాలన్నారు. ఇంగ్లీష్ బోధన, శిక్షణ, అభ్యాసంలో సామూహిక మాధ్యమాలు, ఆధునిక సాంకేతికత సమన్వయం ద్వార బోధనను మరింత సమర్థవంతంగా మార్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఇంగ్లీష్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ సువర్ణ లక్ష్మి, ప్రొఫెసర్ కోన వెంకట్, ప్రొఫెసర్ రామ మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనురాధాతో పాటు పలు దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సును ఏర్పాటు చేసిన సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్: సాంకేతిక లోపం తలెత్తడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడకు బయలుదేరాల్సిన ఇండిగో విమానాన్ని అధికారులు నిలిపివేశారు. 6ఈ 7391 విమానంలో ప్రయాణికులతో కలిసి మొత్తం 79 మంది ఉన్నారు. బోర్డింగ్ అనంతరం రాత్రి 7 గంటలకు విజయవాడ బయలుదేరేందుకు సిద్ధంగా ఉండగా మొరాయించడంతో వెంటనే విమానాన్ని బే-35 తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరించేందుకు ఇంజినీర్లను రప్పించారు. మరమ్మతుల అనంతరం హైదరాబాద్ నుంచి బయలుదేరనున్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



మొబైల్‌ను అప్పగిస్తున్న పోలీసులు

శంషాబాద్: ఢిల్లీకి చెందిన ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న మొబైల్‌ను ఆర్‌జీఐఏ పోలీసులు స్వాధీనం చేసుకుని అప్పగించారు. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన రిషిత్ శర్మ తన ఖరీదైన మొబైల్ ఫోన్ పోయిందని మంగళవారం రాత్రి ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడు వచ్చిన ఉబర్ క్యాబ్‌ను గుర్తించి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ప్రయాణికుడికి అప్పగించారు. కేవలం గంట వ్యవధిలో పోలీసులు స్పందించిన తీరుపై బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే త్వరగా పరిష్కారం సాధ్యమవుతుందని సీఐ కనకయ్య తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

విజయనగర్‌కాలనీ: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని ఆసిఫ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గుడిమల్కాపూర్ సిటీ గ్రాండ్ హోటల్ సమీపంలో ఆసిఫ్‌నగర్ పోలీసులు తనిఖీ చేపట్టారు. విజయనగర్‌కాలనీకి చెందిన సప్దార్‌ఖాన్ (17), సాబేర్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖబీర్(22)లు ఒక్కొక్క క్వింటా చొప్పున తమ హోండా యాక్టీవాలపై వెళ్తుండగా గుడిమల్కాపూర్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. ఆసిఫ్‌నగర్ అంజుమాన్‌లోని రవూఫ్, అక్బర్‌కు అందజేస్తున్నట్లు విచారణలో తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు సప్దార్‌ఖాన్, ఖబీర్‌ను అదుపులోకి తీసుకుని 2 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌సాయి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దొంగిలించిన బైక్‌ల స్వాధీనం

మాదాపూర్: దొంగిలించిన బైక్‌లను పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఇద్దరు నిందితులు ఓర్సు వెంకట్ (19) బోరబండలో నివాసముంటూ సెంట్రింగ్ కూలీగా పనిచేస్తున్నాడు. చంద్రగిరి జీవన్(18) ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 14న మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అటుగా వెళ్తున్న వారిని ఆపి వివరాలు అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రూ. 2.80 లక్షల విలువైన 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓర్సు వెంకట్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు, మొబైల్‌ఫోన్లు కూడా చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితులు స్వాధీనం చేసుకున్న 5 బైక్‌లపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు, ఎస్ఆర్‌నగర్‌లో 2 కేసులు ఉన్నట్లు తెలిపారు.

ఇడ్లీలో పురుగులు ప్రత్యక్షం



శ్రీకర్ ఆర్డర్ చేసిన ఇడ్లీలో పురుగులు



జరిమానా విధిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్ర ఉడిపి హోటల్ టిఫిన్‌లో పురుగులు ప్రత్యక్షం కావడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. జి.శ్రీకర్ సోమవారం ఉదయం హోటల్‌కు వెళ్లి ఇడ్లీ ఆర్డర్ ఇవ్వగా సిబ్బంది అందించారు. ఇంటికి వెళ్లి ఓపెన్ చేసి చూడగా అందులో బొద్దింక, పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో కంగుతున్న శ్రీకర్ హోటల్ యజమానిని ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధితుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి హోటల్‌లో సోదాలు చేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది హోటల్‌లోని కిచెన్ తదితర వాటిని పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంతో రూ.10 వేల జరిమానా విధించారు.

ఎన్నికల్లో బూత్‌స్థాయి ప్రచారమే కీలకం

రాయదుర్గం: ఎన్నికల్లో బూత్ స్థాయి ప్రచారమే కీలకమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బూత్ కమిటీ సమావేశాన్ని నానక్‌రాంగూడలోని డివిజన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించడంపై అవగాహన కల్పించేందుకే ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయమే లక్ష్యంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కారక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, నాయకులు రాకేశ్, కుల్‌దీప్ సింగ్, సునీల్‌సింగ్, శ్యామ్‌రాథోడ్, నర్సింగ్‌నాయక్, శ్రీశైలం, గోపాల్, సహదేవ్, సాయినాథ్, వంశీగౌడ్, విక్రమ్‌గౌడ్, విష్ణు, రాధాకృష్ణయాదవ్, హన్మంతునాయక్, కృష్ణ, నరేందర్, శ్యామ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, దినేష్‌యాదవ్, దయాకర్, కిషన్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో హెచ్‌సీయూ విద్యార్థి సత్తా



నైద్యవ్‌వారణాసి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ ఏడో తరగతి విద్యార్థి నైద్యవ్‌వారణాసి జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపాడు. 1000 మీటర్ల రోడ్ రేసులో బంగారు పతకం, 500 మీటర్ల రింక్ రేసులో వెండి, 1000 మీటర్ల రింక్ రేసులో కాంస్య పతకం గెలుచుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.క్యాంపస్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మురళి, ఫిజికల్ డైరెక్టర్ సతీశ్‌గౌడ్ నైద్యవ్‌వారణాసిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శన చేసి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగించాలని నిరసన

శేరిలింగంపల్లి: రోడ్డును కబ్జా చేసిన నిర్మించిన ప్రహరీని వెంటనే తొలగించి రాకపోకలు సుగుమం చేయాలని కోరుతూ పాపిరెడ్డినగర్‌వాసులు మంగళవారం కాలనీలోని రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలోని 1827 ప్లాట్ వారు రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎస్పీ రెడ్డి, బసవరాజు, కుమార్, శ్రీనివాస్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



'బ్యాడ్ టచ్' పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: చిన్నారులపై లైంగిక వేధింపులు ఎక్కువవుతున్నాయని, వాటిపై వారికి అవగాహన ఉన్నపుడే ఎదుర్కోవడం, నిలువరించటం, పాల్పడిన వారిని చట్టానికి అప్పగించడం చేయవచ్చని సోషల్ యాక్షన్ మొబిలైజర్ ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. మణికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం (పోస్కో) లైంగిక హింస, దాడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన చుట్టు పక్కల వారే పిల్లలను ఎక్కడపడితే అక్కడ టచ్ చేసి వారిని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి టచ్‌లపై పిల్లల్లో అవగాహన ఉంటే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చెప్పే అవకాశం ఉంటుందన్నారు. తాము అమెజాన్ సంస్థతో కలిసి పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాయక్, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే రేషన్ షాపులు కేటాయించాలి



ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్

మణికొండ: అర్హులైన స్థానికులకే రేషన్ షాపులు కేటాయించాలని నార్సింగి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకురాలు ఉషారాణి కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ గిరిజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని రేషన్‌షాపు నంబర్ 3, 4ను స్థానికులకు కాకుండా ఇతర జిల్లాల వారికి కేటాయించారన్నారు. ప్రస్తుతం నార్సింగిలో షాపులు నడుపుతున్న రాజునాయక్‌ది మహబూబ్‌నగర్, శ్రవణ్‌నాయక్‌ది కరీంనగర్ జిల్లాలకు చెందినవారన్నారు. స్థానికంగా ఎస్టీ వర్గానికి చెందిన వారు ఉన్నా.. గతంలో రేషన్ షాపులను తప్పుడు చిరునామాలతో దరఖాస్తు చేసిన వారికి ఇచ్చారన్నారు. వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వారి షాపులను తొలగించి స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలు కూల్చివేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో విస్తరించిన ఈసీ కాలువ బఫర్ జోన్‌తో పాటు ఉప్పర్‌పల్లి జన చైతన్య ఫేజ్-2లోని పార్కులను కబ్జా చేసి నిర్మించిన పలు నిర్మాణాలను రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు మంగళవారం నేలమట్టం చేశారు. హిమాయత్‌సాగర్ నుంచి అత్తాపూర్ వరకు గల ఈసీ కాలువకు ఇరువైపులా కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టి బఫర్ జోన్‌ను కబ్జా చేశారు. అలాగే జన చైతన్య ఫేజ్-2 వద్ద బఫర్ జోన్‌తో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి. సురేందర్ రెడ్డి ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ విశాల్ రెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. సుమారు 700 లగజాల స్థలంలోని ఏడు నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కూల్చి వేసిన స్థలాల్లో మళ్లీ నిర్మిస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కూల్చివేతల నేపథ్యంలో రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోల్కొండలో ఎమ్మెల్యే కౌసర్ పర్యటన



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు తమ ప్రాంత సమస్యలను వివరించారు. బంజారి దర్వాజాతో పాటు ఫతేదర్వాజా వద్ద కూడా ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నాయన్నారు. నల్లాలో వస్తున్న నీరు తాగునీరు సరిపోవడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రిజర్వాయర్‌లో నీటి లెవల్ తక్కువగా ఉండడంతో లో ప్రెజర్‌లో నీరు వస్తున్నాయన్నారు. ట్రాఫిక్ కష్టాలను తీర్చడానికి త్వరలోనే తాను ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. ఏదేమైనా సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సయ్యద్ ఆజామ్ తదితరులున్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం



షేక్‌పేట్‌లో పర్యటిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

గోల్కొండ: రాష్ట్రంలో కల్లిబొల్లి వాగ్దానాలు, హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని పక్కకు పెట్టి కేవలం అవినీతికి పాల్పడడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన అన్నారు. అదే విధంగా బీజేపీ నేటికీ అభ్యర్థిని ప్రకటించడంలో లెక్కలు పెట్టుకుంటుందన్నారు. బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, షకీల్, ఎల్లెష్, మోయిజ్‌ఖాన్ తదితరులున్నారు. అనంతరం ఆయన షేక్‌పేట్‌లో ఏర్పాటు చేయనున్న బీఆర్ఎస్ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి



ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్న జెడ్‌సీ హేమంత్ బోర్ఖడే

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఆదేశించారు. జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై డిప్యూటీ కమిషనర్లు, పన్ను విభాగం ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.575.25 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.326.58 కోట్లు వసూలైందన్నారు. ఇక నుంచి నిరంతరం సమీక్ష ఉంటుందని అలసత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరు ఆర్‌సీపురం సర్కిళ్ల వారీగా ఇచ్చిన లక్ష్యంతో పాటు చేరుకున్న లక్ష్యాన్ని 34 డాకెట్ల వారీగా ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు డిప్యూటీ కమిషనర్లు, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.